ప్రజాశక్తి

శనివారం 15 జులై 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు





పత్తిసాగు వైపు మొగ్గు!

పల్నాడులో తగ్గనున్న మిర్చి, వరి సేద్యం


వర్షాభావం, జలాశయాల్లో నీటి ఎద్దడి ప్రభావం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి సాగు వైపు ఎక్కువ మంది రైతులు మొగ్గుచూపుతున్నారు. మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నా ఈ ఏడాది నీటి ఎద్దడి పొంచి ఉండటంతో మిర్చి సాగు చేసేరైతులు పునరాలోచనలో పడ్డారు. మిర్చికి తప్పని సరిగా నీటి వినియోగం ఎక్కువగా అవసరం ఉంది. గత సీజన్‌లో మిర్చి సాగు కొంత ఆశాజనకంగా ఉన్నా వేసవిలో కురిసిన అకాలవర్షాలకు ఎక్కువ మంది రైతులు నష్టపోయారు. కల్లాల్లో ఆరబోసిన రైతులకు నష్టం జరిగినా పరిహారం రాలేదు. 2021లో తామర తెగులు సోకి ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 1.90 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అప్పట్లో 50 వేల మంది రైతులు నష్టపోయారు. వారికి పరిహారం రాలేదు. తామర తెగులు నివారణకు అవసరానికి మించి పురుగుమందులు వినియోగించాల్సి వచ్చింది. అయితే గత నాలుగేళ్లుగా జలాశయాల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉండటం వల్ల మిర్చికి మూడు తడులకు నీటిఎద్దడి లేకుండా పోయింది. ఈసారి మళ్లీ ఐదేళ్ల క్రితం ఉన్నపరిస్థితి వస్తుందని చెబుతున్నారు. పల్నాడులో 3.10 లక్షల ఎకరాల్లో పత్తి పండిస్తారని అంచనా ఉండగా ఇప్పటివరకు 30 వేల ఎకారాల్లో వేశారు. గుంటూరు జిల్లాలో 77 వేల ఎకరాల్లో పత్తిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 5,040 ఎకరాల్లో పత్తిసాగు జరిగింది. రెండు జిల్లాలో కలిపి 1.80 లక్షల ఎకరాల్లో మిర్చిసాగుఅవుతుందని అంచనా ఉండగా ఈఏడాది మిర్చి సాగు ఇంకా ప్రారంభం కాలేదు. మొత్తంగా గత నాలుగేళ్లలో మిర్చికి పెట్టుబడులు మరింత పెరిగాయి. ధరలు కూడా

▶ 2లో



నీరు వచ్చేదెప్పుడు?

- హైలెవల్ ఛానెల్ నిర్వహణపై రైతుల్లో ఆందోళన
- 25 వేల ఎకరాలకు ఇదే ఆధారం
- బిల్లుల బకాయితో నిలిచిన పంపింగ్ పనులు

ఒకవైపు వర్షాలు రాక సాగు ఆలస్యమవుతుంటే మరోవైపు సాగునీటి కాల్వల్లోనూ నీరు రాక రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఐదు మండలాలకు నీరందించే వడ్లపూడి హైలెవల్ ఛానెల్ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో రైతుల్లో భయం మొదలైంది.

ప్రజాశక్తి - దుగ్గిరాల

మంగళగిరి, దుగ్గిరాల, పెదకాకాని, తెనాలి, చేబ్రోలు మండలాల పరిధిలోని సుమారు 25 వేల ఎకరాలకు ఆధారమైన వడ్లపూడి హైలెవల్ ఛానెల్ నీటి సరఫరాకు సంబంధించి ఇప్పటి వరకూ అధికారులు ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదు. గతంలో బకింగ్‌హామ్ కెనాల్ నుండి ఈ కాలువ ద్వారా నీరు సరఫరా అయ్యేది ఐదు మండలాల్లో ఎక్కువ సాగవుతున్న వరి పొలాలకు ఇదే అధారంగా ఉంది. బకింగ్‌హామ్ కెనాల్ నీటిమట్టం ఎక్కువ ఉంటేనే దీనిలోకి నీరు వెళ్లేది. అందువల్లే దీన్ని హైలెవల్ ఛానెల్ అని పిలుస్తారు. కాల్వకు కొద్దిగా

▶ 2లో

నేడు రైతుల సదస్సు

హైలెవల్ ఛానెల్ లిప్టు బకాయిలు చెల్లించాలని, పంటలకు నీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్, దుగ్గిరాల మండల కార్యదర్శి యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు డిమాండ్ చేశారు. దీనిపై ఛానెల్ పరిధిలోని రైతులతో శనివారం దుగ్గిరాల మండలం పెనుమూలిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 25 వేల ఎకరాలకు నీరందించే కాల్వ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, పక్కన జిల్లా కార్యదర్శి విజయసారధి తదితరులు

ప్రభుత్వ వైఫల్యం వల్లే విద్యార్థుల తగ్గుదల

- చేరికలను పెంచేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం
- జెవికె కిట్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లు అంగీకారం కోసం ఒత్తిళ్లు
- పల్నాడులో ఉపాధ్యాయుల బదిలీపై తల్లిదండ్రుల్లో ఆందోళన
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఏ రాష్ట్ర భవిష్యత్తు అయినా ఆ రాష్ట్ర విద్యా వ్యవస్థపై ఆధారపడి ఉంటుందని, విద్యావ్యవస్థ బలోపేతంగా ఉంటే కుటుంబం, ప్రాంతం, రాష్ట్రం, దేశమే అభివృద్ధి చెందుతుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ సారధి అధ్యక్షత వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నెల దాటినా జెవికె కిట్లను పూర్తి స్థాయిలో అందించలేదని, పాఠశాలకు కిట్లు రాకపోయినా వచ్చినట్లు బయోమెట్రిక్ వేయాలని ఉపాధ్యాయులను ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు తగ్గడం పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5400 ఎలిమెంటరీ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడంతో 1, 2 తరగతుల్లో అసలు చేరని పరిస్థితి

▶ 2లో

ఎమ్‌డియు వాహనాల్లో పాఠ్యపుస్తకాల సరఫరా

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని ఈనెల 20న ఎంఇఒ కార్యాలయాల నుండి ప్రభుత్వ పాఠశాలలకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు ఎమ్‌డియు వాహనాల ద్వారా సరఫరా చేయాల్సి ఉందని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. పౌర సరఫరాల విభాగం, పౌర సరఫరాల సంస్థ పనితీరు, ఇతర అంశాలపై జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి డిఆర్‌సి హాల్లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షించారు. పాఠ్యపుస్తకాల సరఫరాకు సంబంధించి ఇప్పటికే తహశీల్దార్లకు ఆదేశాలు అందాయని, విద్యాశాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు ఆగస్టు నుండి టేక్ హోం రేషన్ పంపిణీకి మహిళా శిశు సంక్షేమ శాఖ, పౌర సరఫరాల శాఖ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారన్నారు. పౌర సరఫరాల సిబ్బందికి ఫోర్టిఫైడ్ బియ్యం గురించి కార్డు దారులకు విస్తత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫోర్టిఫైడ్ బియ్యం కిలో రూ.40లు వెచ్చించి, ప్రభుత్వం కార్డుదారుల ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నందున కార్డుదారులు తమ సొంత అవసరాలకు వినియోగించుకోవాలని, ఏవరికీ అమ్మవద్దని కోరారు. పిడిఎస్ బియ్యం కొన్నా, అమ్మినా చట్టరీత్యా నేరమన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలిపద్మ, జిల్లా మేనేజరు జి.లక్ష్మి, తూనికలు కొలతలు శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, విద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

5లో

గుంటూరు ఛానల్ సమస్య పరిష్కరించాలని

నేడు పెదనందిపాడులో బంద్

రూ.వందకోట్ల పరువునష్టం దావా

- నాపై తప్పుడు ప్రచారం చేసిన వారిని వదిలిపెట్టను
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

వార్త మెయిన్‌లో





ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

ప్రజాశక్తి - మాచర్ల

ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్‌పై రాజకీయ పార్టీల నాయకులతో మాచర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, పులిచింతల స్పెషల్ కలెక్టర్ ఎ.రామచంద్రమూర్తి శుక్రవారం సమావేశమయ్యారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు తోపాటు నాణ్యమైన ఓటర్ల జాబితా తయారీ కోసం నాయకుల సలహాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బిఎల్ఓలతో ఈ నెల 21వ తేదీ నుండి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల జాబితాలో సవరణలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమస్యలేమైనా ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో మాచర్ల, కారంపూడి, దుర్గి తహశీల్దార్లు షేక్ మహమ్మద్ హుస్సేన్, శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌ను అభినందిస్తున్న కనకరావు

జిజిహెచ్ సూపరింటెండెంట్ అభినందన సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

వైద్య రంగానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యమిస్తున్నారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు అన్నారు. జిజిహెచ్‌కు శుక్రవారం వచ్చిన ఆయన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కనకారావు మాట్లాడుతూ గుంటూరు జిజిహెచ్ రోగులకు సేవలు అందించడంలో ఎంతో పేరుందని, అయిదారు జిల్లాల నుంచి ఎంతో మంది రోగులు జిజిహెచ్‌కు వస్తుంటారని చెప్పారు. రోగులకు బాసటగా నిలుస్తున్న జిజిహెచ్‌కు సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్ కుమార్ నియమితులు కావడం సంతోషకరమన్నారు. డాక్టర్ కిరణ్ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి రూపు రేఖలు మార్చారని, గుంటూరు జిజిహెచ్‌ను కూడా అభివృద్ధి పథంలోకి తీసుకుని వెళుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కిషోర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు జి.రాజాసుందరబాబు, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఎం.జ్యోతిబాబు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల నుండి పరారైన విద్యార్థులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు గురుకులం నుండి శుక్రవారం పారిపోయారు. అచ్చంపేటకు



చెందిన కొత్తపల్లి దీవెనరాజు, అత్తలూరుకు చెందిన బంకా మహేంద్రవర్మ, వడ్లమానుకు చెందిన దాసరి మహేష్, గుడివాడకు చెందిన గుంటూరు కిరణ్‌బాబు ఉపాధ్యాయులు మందలించారనే కారణంతో పాఠశాల గోడదూకి వెళ్లిపోయారు. ప్రిన్సిపాల్ జాన్సన్ ఫిర్యాదుతో పోలీసులు సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో విద్యార్థులను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిసింది.

పారదర్శకంగా ప్రభుత్వ రాయితీలు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఇస్తున్న రాయితీలకు పారిశ్రామిక వేత్తలు అందించిన దరఖాస్తులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిష్పక్షపాతంగా పరిష్కరించి, అర్హులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమలు, అనుబంధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం శుక్రవారం సాయంత్రం కలక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అందించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత సమయంలో పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సింగల్ డెస్క్ పోర్టల్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 26 పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించి 36 క్లైయిమ్స్‌కు రూ. 2,94,84,655లు మంజూరు చేస్తూ సమావేశంలో కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ విజయరత్నం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వి.గోపికృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కమర్షియల్ ట్యాక్స్ ఎ.రఘునాథబాబు, ఎపిఎస్ఎఫ్‌టి బ్రాంచ్ మేనేజర్ కె.అజిత, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ ఎం.నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ రీజనల్ ప్రెసిడెంట్ పరిమళ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ఆర్ఎంపి, పిఎంపిలకు విలేజ్ క్లినిక్‌లలో ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అర్హులైన ఆర్ఎంపి, పిఎంపిలకు విలేజ్ క్లినిక్‌లలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అసోషియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్ఒ డాక్టర్ జి.శోభారాణిని శుక్రవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆర్ఎంపి- పిఎంపి కమ్యూనిటీ పారామెడికల్ అసోసియేషన్ నాయకులు జి.జోగేశ్వరబాబు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆర్ఎంపి, పిఎంపిలు అందరికీ కమ్యూనిటీ పారామెడికల్ కోర్సు ట్రైనింగ్ ఇప్పించి ధ్రువపత్రాలు అందించారని, అనంతరం మా సమస్యలను పట్టించుకున్న వారే లేరని అన్నారు. దళిత బహుజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.రమేష్ కుమార్ మాట్లాడుతూ ఆర్ఎంపి, పిఎంపిల కుటుంబాలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విలేజ్ క్లినిక్‌ల వలన రోడ్డున పడ్డాయని, తక్షణమే విలేజ్ క్లినిక్‌లలో ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, ఎస్.రమేష్‌బాబు, నాసరయ్య, సంగీతరావు, అంకిరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకయ్య, హరిబాబు, మస్తాన్‌వలి, హనుమంతురావు పాల్గొన్నారు.



డిఎంహెచ్ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆయుధాలను పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్మ్‌డ్ రిజర్వ్ ఆయుధ నిల్వ కేంద్రాన్ని ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ శుక్రవారం పరిశీలించారు. నిల్వ ఉంచే గది ఎఆర్ డ్యూటి ఆఫీస్, డాగ్ స్క్వాడ్ పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ముఖ్యమైన డ్యూటీలకు ఉపయెగించే తుపాకులు క్షుణ్ణంగా పరిశీలించి ఎస్కార్ట్ డ్యూటి, విఐపిలు డ్యూటి ఇతర ముఖ్యమైన డ్యూటీల అనంతరం ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి కండిషన్‌లో ఉంచాలని సూచించారు. డాగ్‌స్క్వాడ్ కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బంది ఆరోగ్య విషయాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య పరమైనటువంటి ఏదైనా విషయాలు కనిపించిన వెంటనే జిల్లా పోలీస్ ఆరోగ్య కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎస్పీ వెంట ఎఆర్ అదనపు ఎస్‌పి కె.కోటేశ్వరరావు, డిఎస్‌పి చంద్రశేఖర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి సుభాష్, ఆర్ఐలు రాజారావు, థామస్‌రెడ్డి, రాఘవయ్య, రమేష్ కృష్ణన్,స్పెషల్ బ్రాంచ్ సిఐనరసింహరావు ఉన్నారు.



పత్తిసాగు వైపు మొగ్గు!

(మొదటి పేజీ తరువాయి)

బాగా రావడం వల్ల కొంత మంది రైతులు పెట్టుబడులకు నష్టం లేకుండాబయటపడుతున్నారు.

ఈఏడాది ఆల్మట్టి,నారాయణపూర్,జూరాల తదితర జలాశయాలకు నీరురావడంలేదు. అంతేగాక పల్నాడు జిల్లాతోపాటు గుంటూరుజిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో వర్షాలు ఆశాజనకంగా లేవు. పల్నాడులో జులైలో131 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఈ నెలలో ఇప్పటి వరకు కేవలం 41.7మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గుంటూరు జిల్లాలో జులైలో 164.9మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా శుక్రవారం వరకు 128.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో రైతులుమిర్చి సాగుపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మిర్చి సాగు కన్నా పత్తి సాగు మేలన్న భావనలో రైతులు ఉన్నారు. పత్తి క్వింటాళ్ రూ. 8 నుంచి 9 వేలవరకు లభిస్తుందని ఆశిస్తున్నారు. అందువల్ల రైతులు పత్తిసాగుపై దృష్టిసారిస్తున్నారు.

అంతేగాక పల్నాడు ప్రాంతంలో నీటి వసతి ఉన్నా మాగాణి భూములు తప్ప మిగతా ప్రాంతాల్లో వరి సాగుకి రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా వరి సాగు చేసిన రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదు. పెట్టిన పెట్టుబడులకి కనీస గిట్టుబాటు ధరలు రాకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ లో పల్నాడు జిల్లా రైతులు వరి సాగుకు అయిష్టత ప్రదర్శిస్తున్నారు. గతేడాది నీటి విడుదల ఆశాజనకంగా ఉన్నా గత ఖరీఫ్‌లో కేవలం లక్ష ఎకరాల్లోనే సాగుచేశారు. మద్దతు ధరలుకూడా రాకపోవడం వల్ల రైతులు వరిసాగుకు ఆసక్తి చూపడం లేదు. వరి సాగులో ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టినా 40 బస్తాల వరకు దిగుబడి వస్తే తప్ప కనీసం పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంది. దీంతో వరిసాగుకు పల్నాడు రైతుల్లో ఆసక్తి తగ్గింది.

మొదటి పేజీ తరువాయి

నీరు వచ్చేదెప్పుడు?

నీటిమట్టం తగ్గినా దీనిలో సరఫరా ఆగిపోతుంది. దీనిపై రైతులు అప్పట్లో సిపిఎం నాయకులు దివంగత వల్లభనేని సాంబశివరావు నేతృత్వంలో సుదీర్ఘకాలం ఆందోళనలు చేశారు. స్పందించిన ప్రభుత్వం వడ్లపూడి వద్ద లిఫ్టును ఏర్పాటు చేసింది. నిర్వహణకు కాంట్రాక్టరును నియమించారు. నిర్వహణ బిల్లులు రాకపోవడం, సబ్‌స్టేషన్ పూర్తి చేసినా దాన్ని వినియోగంలోకి తీసుకొచ్చే ఇతర నిర్మాణ పనులు పూర్తి కాలేదు. బకాయిలు పెరిగిపోవడంతో తాను నిర్వహించలేనని, బిల్లులు చెల్లిస్తే పనులు పూర్తి చేస్తానని కాంట్రాక్టరు చెబుతున్నారు. ఈ ఛావల్ పరిధిలో కొన్ని ఎకరాల్లో బోర్ల ద్వారా నారుమడులు పోసుకున్నారు. నీరు వస్తాయని ఆశించారు. వర్షాలు లేకపోవడం, కృష్ణానదిలోకి నీరు రాకపోవడంతో బకింగ్‌హామ్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో నీరొచ్చే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో నాట్లు వేసుకోవాలా లేదా అనే విషయంపై ఆందోళన వ్యక్తమవుతోంది. హైలెవల్ కెనాల్‌కు నీరు ఇప్పించాలని, లిఫ్టును నిర్వహణ పనులు పూర్తి చేయాలని, బకాయిలు చెల్లించాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే విద్యార్థుల తగ్గుదల

కూడా కొన్ని పాఠశాలల్లో ఉందన్నారు. 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండటంతో పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందదని తల్లిదండ్రులు భావిస్తున్నారని, అందుకే పిల్లల్ని చేర్చడం లేదని చెప్పారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయకుండా విద్యారంగ సంస్కరణలు చేస్తున్నామని ప్రభుత్వం చెప్పడం అవివేకమని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలలు లేకపోతే హైస్కూల్లో చేరికలపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరిక కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపడతామన్నారు. జీవో 117ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలన్నారు. జిపిఎస్‌ను ఒప్పుకునేదే లేదన్నారు. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు బాగున్నాయని, తల్లిదండ్రులు భావిస్తున్న నేపథ్యంలో కొంతమంది ఉపాధ్యాయులను ప్రభుత్వ సిఫార్సు బదిలీల పేరుతో పంపించడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సిఫార్సులను అక్రమ బదిలీలను నిలిపేయకుంటే డిఇఒ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. విజయ సారథి మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులకు వారు పనిచేసిన ప్రాంతంలో రిలీవ్ చేయకపోవడంతో జీతాలింకా ఇవ్వలేదన్నారు. ప్లస్ వన్ పోస్టులు ప్రవేశాలు ఇచ్చి పంపిన వారికీ జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ పట్టణ అధ్యక్షులు ఒ.కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు టి.ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు జి.ఆంజనేయులు, ఎల్.పూర్ణచంద్రరావు, ఎస్.మురళి పాల్గొన్నారు.

దొంగనోట్ల అడ్డాగా సీతానగరం



ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని సీతానగరం దొంగ నోట్ల మార్పిడి అడ్డాగా మారింది. రెండు వేల రూపాయల నోట్లు ఇక్కడ యథేచ్ఛగా మారుస్తున్నారు. కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఈ తతంగం ఓ ముఠా నిర్వహిస్తుంది. మంచి ఆఫర్లు కూడా ప్రకటిస్తున్నారు. రూ.80 లక్షల విలువ చేసే 500 రూపాయల నోట్లు ఇస్తే కోటి రూపాయల రెండు వేల రూపాయల నోట్లు ఇస్తామంటూ చేసిన ప్రచారానికి కొంతమంది అమాయకులు బోల్తా పడుతున్నారు. ఇటీవల రూ.80 లక్షల విలువ చేసే 500 రూపాయల నోట్లు మంచివి తీసుకుని కోటి రూపాయలు రెండు వేల రూపాయల నకిలీ నోట్లు ఇచ్చి బురిడీ కొట్టించారు. సీతానగరం ప్రధాన కేంద్రంగా ఈ బాగోతం జరుగుతుంది. విజయవాడలోని ఓ పాన్‌షాపు వద్ద రెండు వేల రూపాయల ఫేక్ కరెన్సీని సేకరించి సీతానగరం తీసుకొచ్చారు. కేటుగాళ్ల చేతిలో కొట్ల రూపాయలు మోసపోయిన వారిలో ఓ మాజీ మంత్రి బంధువు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. మంగళగిరి ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద కూడా నోట్ల మార్పిడికి ఈ ముఠా పాల్పడినట్లు తెలుస్తుంది. ఇంత పెద్ద మొత్తంలో లావాదేవీలు జరగడంతో ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెనుకంజ వేస్తున్నారు. ఫిర్యాదు చేస్తే అందుకు సంబంధించిన లెక్కలు చెప్పాల్సి వస్తుందని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల మార్పిడి చేసిన పంపకాల్లో ముఠా మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో అసలు గుట్టురట్టు అయ్యి విషయం బయటకు వచ్చింది. సీతానగరంలో దొంగ నోట్లు మార్పు చేస్తున్నారనే విషయం బయటకు రావడంతో ముఠా పరారైనట్లు తెలిసింది. గత కొంత కాలంగా సీతానగరం కేంద్రంగా బంగారం, నగదు మోసాలు యథేచ్ఛగా జరుగుతు న్నాయి. పోలీసులకు బాధితుల ఫిర్యాదు రాకపోవడంతో ఎక్కడికక్కడ గుట్టుచప్పుడు కాకుండా ఉంటున్నాయి.

బాధితులెవరు ఆశ్రయించలేదు : డిఎస్‌పి రాంబాబు

ఈ ఘటనపై మంగళగిరి దక్షిణ మండలి డిఎస్‌పి రాంబాబు స్పందించారు. ఇప్పటివరకు బాధితులు ఎవరూ తమను ఆశ్రయించలేదన్నారు. మీడియాకు తెలిసినట్టే తమకు తెలిసిందన్నారు. జరిగిన ఘటనపై విచారణ చేస్తున్నామని చెప్పారు.

వేధింపులు తట్టుకోలేక భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండలంలోని వేములూరిపాడు ఎస్సీ కాలనీకి చెందిన కంభంపాటి రాజేష్ భార్య శ్రీలక్ష్మి (29) ఈ నెల 12వ తేదీ తెల్లవారుజామున తన సొంత ఇంటిలో ఫ్యానుకురి వేసుకుని చనిపోయింది. పోలీసు వారు తెలిపిన వివరాల ప్రకారం అమరావతి కి చెందిన శ్రీలక్ష్మికి వేములూరు పాడుకి చెందిన రాజేష్‌తో పదకొండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కొంతకాలంగా భర్త, ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. బయటకు వెళ్ళేటప్పుడు భార్యను ఇంట్లో పెట్టి తాళం వేసి వెళుతుండేవాడు. భర్త పెట్టే హింసలు భరించలేని శ్రీలక్ష్మి తన తల్లిదండ్రులకు చెప్పి బాధపడుతుండేది. ఈ క్రమంలో ఈ నెల 12 తెల్లవారు జామున ఇంట్లో గల ఫ్యానుకు ఉరివేసుకొని చని పోయింది. మృతురాలి తల్లి ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఫిరంగిపురం ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. మృతదేహం గుం టూరు జనరల్ హాస్పిటల్‌లో ఉందని, పంచనామా నిర్వ హించనున్నట్లు చెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమారులు

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వృద్ధుడు మృతి



ప్రజాశక్తి-ముప్పాళ్ల

గుర్తు తెలియని వాహనం ఢీకొని భిక్షాటన చేసుకునే 55 ఏళ్ల వద్ధుడు మతిచెందిన ఘటన మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మతిచెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలు అవ్వడంతో 108 లో సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మతిచెందాడనీ మతుడు చనిపోయేముందు గోదావరి జిల్లా యాసలో మాట్లాడనీ డాక్టర్లు తెలిపినట్లు మతుని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మతుని యొక్క సమాచారం తెలిసినవారు ఈ క్రింది ఫోన్ నెంబర్లు ముప్పాళ్ల పోలీసు స్టేషన్ 08641242433 గానీ మొబైల్ నెంబరు 9440796233 తెలపాలని ముప్పాళ్ల ఎఎస్ఐ హిమామ్ తెలిపారు.

బహిరంగంగా మద్యం సేవిస్తున్న యువకులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ పరిధిలో బుర్రిపాలెం రోడ్డు, చిన్న పరిమి డొంక, కంచర్లపాలెం, సోమ సుందర పాలెం శివారు తదితర ప్రాం తాలను , అనుమానిత ప్రదేశాలలో రూరల్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు కౌన్సిలింగ్ నిర్వహించారు. మొత్తం ఆరుగురి పై కేసు నమోదు చేశారు. వారిని శనివారం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్సై తెలిపారు. యువత గంజాయి మద్యం మత్తు తదితర చెడు వ్యసనాలకు లోను కారాదని హెచ్చరించారు.



పెట్రోల్ దొంగలు



ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి రన్నింగ్ రూమ్ సెంటర్‌లో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్‌ను రాత్రి పూట దొంగలు తస్కరిస్తు న్నారు. నెలలో పది రోజుల పాటు ఈ దొంగతనాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఆకాశాన్నంటుతున్న పెట్రోల్ ధరలు చూసి ఆర్థిక పరిస్థితి బాగోలేక లీటర్ పెట్రోల్ పోయిస్తే తెల్లారేసరికి మాయమైపోతుందని బాధితులు చెబుతున్నారు. పోలీసులు నైట్ బీట్ పెంచి పెట్రోల్ దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నారు.

భార్యాపిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు





ప్రజాశక్తి-ప్రత్తిపాడు

తన భార్యాపిల్లలు కనిపించడం లేదని భర్త పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన సంఘటన ప్రత్తిపాడు మండలం చోటు చేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండల కేంద్రనికి చెందిన గొడ్డేటి పరమేశ్వర రావు, ఆయన భార్య గొడ్డేటి ఓబులమ్మ విరికి ఇద్దరు కుమార్తెలు యసస్విని(5),సహస్ర (2)లు ఈ నెల 11వ తేదీన ఎవరికీ చెప్ప కుండా ఇంట్లో నుండి పోయినట్లు, అప్పటి నుండి వెతికినప్పటికీ వారి ఆచూకి దొరకలేదు అని బర్త పరమేశ్వరావు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్ ఐ రవీంద్ర బాబు తెలిపారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 26,968
మిర్చి ఎగుమతి	: 29,955
మిర్చి నిల్వ	: 9,098

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,800
నెం.5	10,000 - 23,000
273	14,500 - 14,500
341	10,500 - 21,000
4884	15,000 - 19,000
సూపర్ 10	10,000 - 22,000
నాన్ ఎసి	
తేజ	9,500 - 24,200
బడిగి	10,000 - 26,000
దేవనూరు డీలక్స్	11,500 - 22,000
తాలుకాయలు	6,000 -14,500
ఎసి	
334	13,000 - 22,000
341	15,000 - 22,300
తేజ	11,000 - 24,000
బడిగి	13,000 - 23,000
తాలుకాయలు	7,000 -13,500

ఉంగరం అపహరణపై కేసు

ప్రజాశక్తి - తెనాలి

ఉంగరం అపహరించిన ఉద్యోగినిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వైకుంఠపురం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రెండ్రోజుల క్రితం హుండీ లెక్కించారు. ఈ ప్రక్రియలో ఆలయ సూపరింటెండెంట్ నిర్మల రాణి బంగారపు ఉంగరాన్ని అపహరించారు. గమనించిన సహోదయోగుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన ఆలయ సహాయక కమిషనర్ తిమ్మనాయుడు ఆమెను అదేరోజున సస్పెండ్ చేశారు. ఇదే విషయంపై వన్‌టౌన్ పోలీసులకు తిమ్మనాయుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిర్మలరాణి పై కేసు నమోదు చేశారు.

కొనసాగుతున్న సురక్ష క్యాంప్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో జగనన్న సురక్ష క్యాంపులు కొన సాగుతున్నాయి. శుక్రవారం నగరంలోని పొత్తూరివారితోట, పాల ఆసుపత్రి, బ్రాడిపేట, జేకేసి కాలేజిరోడ్ తదితర ప్రాంతాల్లో జరిగిన జగనన్న సురక్ష క్యాంపుల్లో మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా, డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజిలా, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటివద్దకే చేరుస్తుందన్నారు. అనంతరం సురక్ష క్యాంప్‌లో వివిధ అంశాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి ధృవ పత్రాలను అందించారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్దిరోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టి, ఈచంపాటి వెంకటకృష్ణ, జి.నాగారంగమణి రమేష్, వై.రవి, డాక్టర్ విజయలక్ష్మి, గుంటూరు తూర్పు తహసిల్దార్ నగేష్ పాల్గొన్నారు.



విద్యార్థిని గ్రేస్ ఏంజెల్ బాయ్‌కు చెక్ అందిస్తున్న కలెక్టర్

ట్రిపుల్ ఐటి 3వ ర్యాంకర్‌కు కలెక్టర్ రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఐఐటి ప్రవేశ పరీక్షలో ఎస్టీ కేటగిరిలో 5వ ర్యాంకు సాధించిన వినుకొండ మండలం పాలకూరు తండాకు చెందిన రమావత్ గ్రేస్ ఏంజెల్ బాయ్‌కు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకాన్ని శుక్రవారం తన ఛాంబర్‌లో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరింత కష్టపడి, ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. జీవితంలో ఎదగడంతోపాటు మరి కొంతమందికి ఉపాధి కల్పించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల్ నాయుడు, నవోదయం కో-ఆర్డినేటర్ సంజీవరావు, గ్రేస్ విద్యార్థిని తండ్రి రమావత్ మంత్రు నాయక్ పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

రొంపిచర్ల జెడ్‌పి విద్యార్థినులకు ట్రిపుల్ ఐటిలో సీట్లు


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనేందుకు రెబ్బా శ్రీనిధిసుష్మ, పిడెం ప్రత్యూష నిదర్శనమని మండల కేంద్రమైన రొంపిచర్ల జెడ్‌పి పాఠశాల హెచ్ఎం బి.ఎం సుభాని అన్నారు. ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థినులను పాఠశాలలో శుక్రవారం అభినందించారు. గతేడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన రెబ్బా శ్రీనిధిసుష్మ, పిడెం ప్రత్యూష ట్రిపుల్ ఐటిలో ప్రవేశానికి అర్హత పొందినట్లు చెప్పారు. వారితోపాటు వారికి సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, శేషిరెడ్డి, రామచంద్ర, సైదయ్య, ఆదిలక్ష్మి, సునీత, పూర్ణిమ, శోభారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి నలుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోని ఫాతిమా విద్యానికేతన్, ఆల్ ఫోర్స్ పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు లూర్దు మరిరెడ్డి, పూజల వెంకటేశ్వర్లు తెలిపారు. ఫాతిమా విద్యా నికేతనకు చెందిన సన్నగంటి హేమంత్, ఒప్పిచర్ల నాగ మురళి, ఆల్ ఫోర్స్ పాఠశాలకు చెందిన గొరిగే ఆకాశ్, గుండా అమూల్య ఎంపికయ్యారు వీరందరికీ పదో తరగతిలో 584 మార్కులు నుండి 590 వరకు వచ్చాయి.



ఎస్.హేమంత్, ఒ.నాగ మురళి, జి.ఆకాశ్, జి.అమూల్య

పాఠాలు సరిగా చెప్పకుండా బెదిరిస్తున్నారు

- తెలుగు, ఇంగ్లీషు ఉపాధ్యాయులపై విద్యార్థుల ఫిర్యాదు
- గైడ్లు కొనుక్కోవాలంటున్నారని, ఓపెన్ యూనివర్సిటీలో చదవాలంటున్నారని ఎమ్మెల్యే ఎదుట ఆవేదన
- వినుకొండ జ్యోతిబాపూలే పాఠశాలలో విచారణ కోసం కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

పాఠశాలు చెప్పకపోగా తమను వేధిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు బాబు రావు, ఇగ్లీషు ఉపాధ్యాయుడు లింకన్‌ను విధుల నుండి తొలగించాలని పట్టణంలోని ఎన్‌ఆర్‌టి రోడ్డులో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులం విద్యార్థులు డిమాండ్ చేశారు. వారిని కొనసాగించేట్టయితే తమకు టీసీలు ఇవ్వాలని ఎమ్మెల్యే ఎదుట ఆవేదనను వెళ్లగక్కారు. ఈ పాఠశాలపై కొన్ని రోజులుగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో గురుకులాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులను ప్రిన్సిపల్ ఛాంబర్‌కు పిలిపించి వారితో మాట్లాడారు. తెలుగు, ఇంగ్లీష్ ఉపాధ్యాయులిద్దరూ మిగతా ఉపాధ్యాయులతో నిత్యం ఘర్షణలకు దిగుతారని, పాఠాలు సరిగా చెప్పడం లేదని అన్నారు. వారు చెప్పే పాఠశాలు అర్థం కావడం లేదని అడుగుతుంటే గైడ్‌లు కొనుక్కోవాలంటూ కోప్పడుతున్నారని, తల్లిదండ్రులను పిలిపించి కూడా గైడ్లు కొనాలంటున్నారని వివరించారు. పైగా పదో తరగతి పరీక్షలు ఓపెన్ యూనివర్సిటీలో రాసుకోవాలంటూ సలహాలిస్తున్నారని, ఇవ్వన్నీ చేసేట్టయితే ఉపాధ్యాయులుగా వారెందుకు, వారికి జీతాలు ఇవ్వడం ఎందుకూ? అని ప్రశ్నించారు. పాఠశాలలో విచారణ కోసం కొద్దిరోజుల కిందట వచ్చిన అధికారికి తాము ఫిర్యాదు చేశామని, అప్పటి నుండి ఉపాధ్యాయులిద్దరూ తమను వేధిస్తున్నారని వాపోయారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఇంగ్లీషు ఉపాధ్యాయుడు లింకన్ ఏదో రాసుకొచ్చాడని, బెదిరించి తమ సంతకాలను తీసుకెళ్లారని, అందులో ఏముందో తమకు తెలియదని అన్నారు. గత మార్చిలో జరిగిన 9వ తరగతి పరీక్ష తెలుగు పేపర్లను ఉపాధ్యాయుడు బాబురావు 6వ తరగతి పిల్లలతో దిద్దించడమూ విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య ఘర్షణలకు దారి తీసిందని వెల్లడించారు. వీటన్నింటినీ విన్న ఎమ్మెల్యే స్పందిస్తూ ఇంత జరుగుతుంటే మీరేం చేస్తున్నారని ప్రిన్సిపాల్ ప్రసాద్‌ను నిలదీశారు. తనకేమీ తెలీదనే ప్రిన్సిపాల్ సమాధానంపై మండిపడ్డారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను పిలిపించాలని కోరగా ఇంటికి వెళ్లారని ఒకసారి, ఆస్పత్రికి వెళ్లారని మరోసారి ప్రిన్సిపాల్ చెప్పారు. దీంతో కలెక్టర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించిన ఎమ్మెల్యే విషయాన్ని వివరించారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే వెంట న్యాయవాది ప్రసాద్, వైసిపి నాయకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని నర్సరీలకు నోటీసులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్



నర్సరీ యజమానులకు నోటీసులు అందజేస్తున్న అధికారులు

నర్సరీ యజమానులు నర్సరీ చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన అధికారి ఎన్.సురేష్ అన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని మందాడి, బోదెల వీడు, గుండ్లపాడు గ్రామాల్లోని షేడ్‌నెట్ నర్సరీలను ఆయన శుక్రవారం పరిశీలించారు. లైసెన్స్ లేని నర్సరీలకు, రిజిస్టర్లు లేని నర్సరీలకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నర్సరీ చట్టం 2010 ప్రకారం నర్సరీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ కోసం షేడ్ నెట్ చుట్టూ 8 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్టుతో రక్షణ కల్పించాలని చెప్పారు. షేడ్ నెట్ హౌస్‌లో డబుల్ డోర్ సిస్టం కలిగి ఉండాలని, పైన ఉన్న నెట్‌కు గాని ఇన్సెక్ట్ నెట్‌కు గాని కీటకాలు లోపల ప్రవేశించకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. మిరప విత్తనాలను పోట్రేలలో నాటి వాటిని ఎత్తయిన మడులపై అమర్చాలని పోట్రేలలో శుద్ధి చేసిన కోకో పీట్ మాత్రమే వాడాలని చెప్పారు. కోకో పీట్‌ను శుద్ధి చేయుటకు ఒక కిలో ట్రైకోడెర్మా విరిడి, ఒక కిలో సూడోమోనాస్ కలపాలని వివరించారు. నర్సరీ యజమానులు విత్తనాన్ని కొనుగోలు చేసినప్పుడు విత్తనాల ప్యాకెట్ మీద విత్తన రకము, లాట్ నెంబరు, కంపెనీ యొక్క లేబుల్‌ను గమనించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొన్న ఒరిజినల్ రసీదులను భద్రపరచుకుని నర్సరీ రిజిస్టర్‌లలో నమోదు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్సు లేని ప్రతి ఒక్కరు లైసెన్స్ కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని, కొత్తగా షేడ్ నెట్ నర్సరీలు వేసిన వారు కూడా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలని చెప్పారు. లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సిన నర్సరీలు ఉన్నట్లయితే ఆ నర్సరీ యజమానులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రైతులకు నాసిరకం నారు అందించే నర్సరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ధరలకు విక్రయించినా చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో బోదుల వీడు విహెచ్ఎ భాను కుమార్, ఎంపిఇఒ శివ నాయక్, నర్సరీ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

భూ పంపిణీని విధానంగా చేపట్టాలి

- అసైన్డ్ భూములను అమ్ముకునే హక్కు ఇస్తే పేదలకు నష్టం
- భూ పంపిణీకి అవకాశాలపై త్వరలో జిల్లా స్థాయి భూ సదస్సు
- చర్లగుడిపాడు, గొరిజవోలులో భూములను పేదలకివ్వాలి
- వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాష్ట్రంలో 54 వేల ఎకరాలను భూమిలేని పేదలకు అసైన్మెంట్ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి చెప్పారు. ఈ మేరకు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. భూ పంపిణీని ఒక విధానంగా ప్రకటించి నవరత్న పథకాల్లో ఒక పథకంగా చేర్చాలని కోరారు. అసైన్‌మెంట్ అయిన 20 ఏళ్ల తర్వాత పూర్తి హక్కుల పేరుతో భూస్వాములు, వ్యవసాయేతరులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అసైన్మెంట్ భూములను కొనుగోలు చేసే అవకాశం ఇవ్వడాన్ని తమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికే సాగుభూమి పరాయికరణ చెందుతుందని, ప్రభుత్వ ఈ నిర్ణయంతో ఈ వేగం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ గ్రామంలో భూమి అమ్మకాలు, కొనుగోళ్లు పరిశీలించినా వ్యవసాయం చేసే వారెవరూ భూములు కొనడం లేదని, కేవలం తమ డబ్బు దాచుకోవడానికి భూములు కొంటున్నారన్నారు. దీనివల్ల సాగు చేసే వారి చేతిలో భూమి లేకుండా పోతుందని అన్నారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో సుమారు లక్ష ఎకరాలకు పైగా సాగుభూముల్లో వెంచర్లు వెలిశాయని, మరోవైపు వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు వలసలు వెళుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితులు మారాలంటే సాగు చేసే వారి చేతిలో భూమి ఉండాలని, పంటలకు మద్దతు ధరలు దక్కాలని అన్నారు. ఈ ప్రత్యామ్నాయ విధానాల కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో పేదలకు భూ పంపిణీ చేయడానికి వేలాది ఎకరాల సిద్ధంగా ఉన్నాయని అయినా ప్రభుత్వం చొరవ చేయడం లేదని విమర్శించారు. గురజాల మండలం చర్లగుడిపాడులో 300 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంటనే పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. నాదెండ్ల మండలం గొరిజవోలులో 150 ఎకరాలు పేదల చేతుల్లో ఉన్న సాగు భూమిని రికార్డుల్లో చెరువుగా నమోదు చేశారని, రీ సర్వే సందర్భంగా వాస్తవాలను నమోదు చేయాలని, ఈ భూమిని రీ క్లాసిఫికేషన్ చేసి పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తే జిల్లాలో పేదలకు భూమి పంపిణీ చేయడానికి అనేక అవకాశాలు ఉన్నాయని, వాటన్నిటిని బయట పెట్టడానికి త్వరలో తమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భూ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

ప్లాట్లలో రాళ్లు .. పాతాళంలో నీళ్లు

జగనన్న కాలనీల్లో ప్రజల అవస్థలు

స్థానికంగానే స్థలమివ్వాలని లబ్దిదారుల విజ్ఞప్తి


రాళ్ల మయంగాఉన్న జగనన్న కాలనీ స్థలాలు


నీళ్లురాక నిరుపయోగంగా బోరు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

జగనన్న కేటాయించిన ప్లాట్లలో చట్టుబండల మయంగా ఉండటంతో ఇళ్లు కట్టుకోవడం కష్టమవుతుందని లబ్దిదారులు వాపోతున్నారు. అదీకాక ప్రభుత్వమే జలకళ పథకంలో దాదాపు 300 అడుగులు బోరు వేసినా చుక్క నీళ్లు పైకిరావడం లేదని, స్థానికంగానే స్థలాలిస్తే ఈ సమస్యలు ఉండేవి కాదని లబ్దిదారులు వాపోతున్నారు. సమస్య పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.


జగనన్నప్లాట్లలో నివాసమున్న ఒకే ఒక్క లబ్ధిదారుడు

మండలంలోని బేతపూడి గ్రామం బేతపూడి శివారు రేగుల గడ్డ, గుండాలపాడు గ్రామాలకు సంబంధించి గుండాలపాడు అగ్రహారంలో దాసులు కాలనీలో తాడికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో 2020లో శుకుస్థాపన చేసి 92 మందికి పట్టాలిచ్చారు. మొదటినుండి లబ్ధిదారులు ఈ కాలనీలో వసతులు సరిగా లేవని ఏ ఊరికి ఆ ఊరిలో మంచి స్థలంలో జగనన్న కాలనీ ఇవ్వాలని కోరిన పెడచెవిన పెట్టి గుండాలపాడు అగ్రహారం దాసులు కాలనీలో రెండు గ్రామాలకు కలిపి ఇవ్వడం జరిగింది. ఇక్కడ ఇచ్చిన ప్లాట్‌లకు మట్టి తోలటానికి ఒక్కో ఫ్లాట్ కి రూ.30 వేలు ఖర్చు అవుతుందని లబ్దిదారులు చెప్పారు. ఇళ్లు నిర్మించుకోవడానికి పునాదులు తవ్వితే మొత్తం చట్టు బండలు పడ్డాయని, నీటి వసతి కూడా లేనందున ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నామని మరికొందరు లబ్దిదారులు తెలిపారు. ఇళ్లు నిర్మించుకోవడానికి ట్యాంకర్లనుండి నీటిని తీసుకువస్తే ఖర్చు తడిచి మోపెడవుతుందని తెలిపారు. కాలనీలో మొత్తం ఒక ఇళ్లు పూర్తి అయ్యిందని, అదికూడా వైసిపి నాయకులకు చెందిదని తెలిపారు. మరో లబ్దిదారుడు పునాదులు పూర్తి చేసుకుని పైన రేకులు, పట్టాలు వేసుకుని నివసిస్తున్నామని, నీళ్లు తాత్కాలికంగా సమీపంలోని కాలనీ నుండి తెచ్చుకుంటున్నామని తెలిపారు. వర్షాలు కురిస్తే పల్లంలో కాలనీ ఉన్నందున జలమయం అవుతుందని తెలిపారు. బేతపూడి లబ్ధిదారులకు గుండాలపాడులో ప్లాట్లు ఇవ్వడం వలన భవిష్యత్తులో రేషన్ కార్డు, ఓటరు కార్డు మారిపోతాయని లబ్దిదారులు తెలిపారు. నివాసయోగ్యం కాని ప్రదేశంలో స్థలాలిచ్చి ఇళు నిర్మించుకోమంటే ఏ విధంగా నిర్మించుకోగలమని తమకు అప్పులు పుట్టే పరిస్థితి కూడా లేదని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు స్పందించి ఏ ఊరు కావూరు జగనన్న కాలనీకి మంచి స్థలాలను కేటాయించాలని లబ్దిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.


జగనన్న కాలనీ శిలాఫలకం


మాట్లాడుతున్న జెవి రాఘవులు

బిజెపిని సాగనంపాల్సిందే

సిపిఎం విస్తృత సమావేశంలో జెవి రాఘవులు

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలకు నష్టం కలిగించే బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ విస్తృత సమావేశం వివి జవహర్లాల్ అధ్యక్షతన జరిగింది. రాఘవులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 9 సంవత్సరాల బిజెపి మోడీ ప్రభుత్వ హయాంలో దేశం అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కామన్ సివిల్ కోడ్ ను అత్యధిక పార్టీలు వ్యతిరేకించినప్పటికీ పార్లమెంట్లో బిల్లు పెట్టి చట్టం చేయడానికి బిజెపి పూనుకుందని అన్నారు. అందువలన బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చేంగయ్యా మాట్లాడుతూ బిజెపి కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించే రానున్న ఎన్నికల్లో తమ పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. మణిపూర్‌లో ఘర్షణలకు బిజెపి కారణమని అన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపికి అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంచడం, ఆయిల్ ధరలు పెంచడం అనేక సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్నప్పటికీ వైసీపీ, టిడిపి మద్దతు తెలియజేస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రానికి నష్టం కలిగించే బిజెపి విధానాలను వ్యతిరేకించాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజా ఆందోళనలో కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ సమస్య పరిష్కరించాలని

నేడు పెదనందిపాడులో బంద్

జయప్రదం చేయాలని రైతు సంఘం విస్తృత సమావేశం

ప్రజాశక్తి - పెదనందిపాడు

గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపునకు అవసరమైన భూసేకరణకు వెంటనే నిధులు కేటాయించాలని నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో గత 17 రోజుల నుండి గుంటూరులో నిరాహార దీక్షలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం సమంజసం కాదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. పెదనందిపాడులో తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌలు రైతు రైతు సంఘాల విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు గుంటూరు ఛానల్ పొడిగింపు వల్ల 50 గ్రాములకు తాగునీరు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తాయని కీలకమైన ఈ ప్రాజెక్టు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. గుంటూరు ఛానల్‌సమస్యపై ప్రభుత్వం తక్షణం స్పందించాలని శనివారం నిర్వహించే పెదనందిపాడు బంద్‌ను రైతులు, కౌలు రైతులుఅధిక సంంఖ్యలోపాల్గొని జయప్రదం చేయాలని అజయ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో గుంటూరు ఛానల్ సాధన సమితి నాయకులు కుర్రా హరిబాబు, నరిశెట్టి ఆచార్యులు, రైతు సంఘం నాయకులు మద్దన వెంకటేశ్వర్లు, బండి శంకరయ్య, కొత్త శివనాగేశ్వరరావు, కాపు వెంకట సుబ్బారావు, జంపని రామారావు, పసుపులేటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ కుమార్

17వ రోజుకు గుంటూరు ఛానల్ దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించి, 50 గ్రామాల ప్రజలకు త్రాగునీరు, 50వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరహార దీక్షలు 17వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దీక్షల్లో మేడావారి పాలెం సర్పంచ్ వీరగంధం చెంచులక్ష్మి, లావు చౌడేశ్వరి, దివ్వి ప్రమీల, కనగాల భారతి, సిదాభతిన సూర్యవతి, దాసరి భ్రమరాంబ, దుద్దెంపూడి బసవమ్మ, నింగిశెట్టి శేషమ్మ గుత్తా మాణిక్యమ్మ, దివ్య నారాయణమ్మ, ఏ.మల్లికార్జున, చెన్నుపాటి ఆనంద పాప దుడంపూడి కాంతమ్మ, రైతు నాయకులు నాయుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. తెలుగు దేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు తెనాలి శ్రావన్‌కుమార్ పాల్గొని మద్దతు తెలిపారు. దీక్షల్లో ప్రొఫెసర్ కారుమంచి విజయకుమార్, తెలుగు దేశం రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా ఉపయోగించుకోవటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, నీరు ఇవ్వటానికి ఏమీ చేయలేదని వారు విమర్శించారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ పాల్గొన్నారు.

మేకా అమరారెడ్డి కుమారుడు ప్రతాపరెడ్డి కన్నుమూత

నివాళులర్పించిన సిపిఎం నేత సిహెచ్ బాబురావు, ఇతర నాయకులు



ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్రాంతంలో సిపిఎం ఉద్యమ నాయకులు మేకా అమరారెడ్డి రెండో కుమారుడు ప్రతాపరెడ్డి (51) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆయన విజయవాడలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మేకా అమరారెడ్డికి నలుగురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు ప్రతాపరెడ్డి నాల్గో సంతానం. పెద్ద కుమార్తె దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి గతంలో తాడేపల్లి సిపిఎంసర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. భర్త దొంతిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్తుతం తాడేపల్లి రూరల్ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ప్రతాపరెడ్డి మృతి విషయం తెలుసుకున్న పలువురు సిపిఎం నాయకులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర ర్యాదర్శి, ఉపాధ్యక్షులు ఎస్.అనిల్‌కుమార్, గాదె సుబ్బారెడ్డి, విజయవాడ ఎంబివికె కార్యదర్శి యువి రామరాజు, విశ్రాంత సైనిక ఉద్యోగి గోపాలం సాంబశివరావు, విశ్రాంత ఉద్యోగులు మిరియాల వెంకట కోటేశ్వరరావు, రేఖ కోటేశ్వరరావు, తాడిబోయిన నాగేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, గాదె సుబారెడ్డి, కొట్టె కరుణాకరరావు, ఎస్.ముత్యాలరావు, కె.మేరి, ఎం.శ్రీనివాసరెడ్డి, డివి భాస్కరరెడ్డి, వై.బర్నబస్, తులసమ్మ, ఎం.దుర్గారావు, వి.గోపిరెడ్డి, సీతాదేవి, సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.రవి, ఈమని రామారావు, సిహెచ్.సుందరరావు, వి.వెంకటేశ్వరరావు, సైకం వెంటనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, జంగాల సాంబశివరావు, ఢిల్లీ రామారావు, ఎ.మురళీ, మాజీ ఎంపిపి డి.వేమారెడ్డి, మాజీ కౌన్సిలర్లు కె.వెంకటేశ్వరరావు, ఎమ్‌డి గోరెబాబు, ఎం.అబ్బు, వైసిపి నాయకులు మేకా అంజిరెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు. తాడేపల్లి కొత్తూరు, ప్రాతూరు ప్రాంతాలకు చెందిన అనేక మంది వచ్చి నివాళులర్పించారు.

కుటుంబ సభ్యులకు పరామర్శ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ప్రతాపరెడ్డి తల్లి మేకా శివమ్మ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రతాపరెడ్డి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.


కార్పొరేటర్లతో చర్చిస్తున్న కమిషనర్

కార్పొరేటర్లతో కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్ల నుండి అందే ఫిర్యాదులు, ఆర్జీలను సంబంధిత విభాగాధిపతులే ప్రత్యక్షంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు గుర్తించి అధికారుల దష్టికి తెచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విభాగాదిపతులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యల పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - దాచేపల్లి

ఈ నెల 18వ తేదీన పల్నాడు జిల్లా డిఎంహెచ్ఓ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గురజాల అర్బన్ పీహెచ్సీ డాక్టర్ నితిన్‌కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆశ వర్కర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ 1000 జనాభా పరిధిలో పని చేయాల్సి ఉండగా దాని 3000 జనాభా పరిధిలో పనిచేయాలని ఆదేశాలివ్వడం, నాణ్యమైన ఫోన్లు లేకపోవడం వలన ఆశ వర్కర్లు ఆన్ లైన్ వర్కు చేయడంలో ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. 4జ4 సిమ్‌తో పాటు నాణ్యమైన సెల్ ఫోన్ ఇవ్వాలని, రికార్డు వర్క్ రాసేందుకు రికార్డులు ప్రభుత్వం ఉచితంగా సప్లై చేయాలని, పండగ సెలవులు, క్యాజువల్ లీవ్స్ మెడికల్ లీవులు వేతనంతో కూడిన సెల వులను ప్రభుత్వం మంజూరు చేయాలని, ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఆశా వర్కర్లను వెంటనే పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఈ ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. నరసరావుపేట డిఎంహెచ్ఓ ఆఫీస్ వద్ద జరిగే ఈ ధర్నా లో ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

వినతిపత్రం అందజేసిన వారిలో సిఐటియు జిల్లా నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, షేక్ చిలార్, ఆశా వర్కర్లు కె . జ్యోతి, సీత, వెంకటరమణ, నగ్మా, శాంతి, సీతామాలక్ష్మి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు



జివి ఆంజనేయులు పుట్టినరోజు సందర్భంగా

ఉచిత మెగా వైద్యశిబిరం

పజాశక్తి - వినుకొండ

పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు పుట్టినరోజు సందర్భంగా శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నరస రావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. జీవి ఆంజనేయులు, ఆయన భార్య లీలావతి ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజ లకు సేవ చేయాలనే లక్ష్యంతో శివశక్తి ఫౌండేషన్ ఏర్పాటు చేసి గత 20 ఏళ్లగా అనేక సేవా కార్యక్రమాలు అంది స్తున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షల అనంతరం ఉచిత మం దులు పంపిణీ చేశారు. వినుకొండ నియోజకవర్గం ప్రజలకు తానెప్పుడు అందుబాటులో ఉండి సేవలు చేస్తూనే ఉంటా మని తెలిపారు. వైద్య సేవలందించిన ప్రముఖ వైద్యులను సత్కరించిన ఆంజనేయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వినుకొండ నియోజకవర్గం పరిశీలకులు ఎం.శివప్రసాద్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీంఖాన్, మండల పార్టీ అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, మీసాల మురళీ కృష్ణ యాదవ్, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దారు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నూజెండ్ల

జీవి ఆంజనేయులు పుట్టినరోజు సందర్భంగా శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి మం డలంలోని తలార్లపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠ శాలలో కేక్ కట్ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు ,పెన్నులు, స్వీట్స్ పంచి పెట్టారు. స్కూల్ ఆవరణలో మొక్కలు నాటా రు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్య క్షులు మీసాల మురళి యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఒంటేరు ఏడు కొండలు, గురువారెడ్డి, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వజ్రాల వేట

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



పరికరంతో రాళ్ళను టెస్ట్ చేస్తున్న వ్యాపారి

సత్తెనపల్లిలో వజ్రాల వేట కొనసాగుతోంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ పరిధిలోని బసవమ్మ వాగు ఒడ్డున ఉన్న పొలంలో వజ్రాలు దొరుకుతున్నాయన్న వదంతులతో జిల్లా నలు మూలల నుండి వజ్రాల కోసం తరలి వస్తున్నారు. కళాశాల వెళ్ళే విద్యార్థినీవిద్యార్థులు, మహిళలు వెతుకు తున్నారు. వ్యాపారులు టెస్టింగ్ మిషన్ తో పొలంలో తిష్ట వేశారు. కొడవళ్ళతో పొలాన్ని అణువణువు గాలిస్తు న్నారు. స్పటిక రంగులో ఉన్న రాళ్ళను ఏరుకుంటున్నారు. సత్తెనపల్లి ,పెదకూరపాడు నియోజకవర్గాల నుండి జనం ద్విచక్రవాహ నాల్లో, ఆటోల్లో తండోపతండాలుగా తరలివస్తున్నారు.

ప్రజాశక్తి-బెల్లంకొండ



మండలంలోని కోళ్లూరు అడవి ప్రాం తంలో దొరికిన రాయిని మీటర్‌కు పెట్టగానే రాయి నాణ్యతను పాయింట్ల రూపంలో అది చూపిస్తుంది. కనీసం ఎనిమిది పాయింట్లు వస్తేనే అది వజ్రంగా గుర్తిస్తారని స్థానిక యువ కుడు చెబుతున్నాడు. ఈ విషయం తెలియటంతో స్థానికులు పెద్ద సంఖ్యలో వచ్చి వజ్రాలు వెదుకుతూ నాణ్యతను చెక్ చేయిం చుకుంటున్నారు.

'చలో విజయవాడ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

రొంపిచర్ల మండలంలో సంతగుడిపాడు జిడిసిసి బ్యాంక్ ఆవరణలో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'చలో విజయవాడ' జరుగుతుందని అన్నారు. జివో నెం.36ను అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. 2019 తర్వాత ఉద్యోగాలలో చేరిన వారిని క్రమబద్ధీకరించాలన్న డిమాండ్లతో ఈ కార్యక్రమం జరుగుతోందని, ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీల సిఇఒలు శివారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వీరారెడ్డి, దీపక్ రెడ్డి, మల్లయ్య, ఐక్యవేదిక నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-బెల్లంకొండ



మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం స్థానిక మండల పరిషత్ అధికారి కార్యాలయంలో శు క్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ తురక ఏడుకొండలు, జడ్పిటిసి గాదె వెంకటరెడ్డి హాజరయ్యారు. మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య మాట్లాడుతూ మండలంలో వేసిన వివిధ పంటల సరళి, వేయదగిన పంటలు,రకాలు, కౌలు రైతులకు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకునే విధానం తెలిపారు. నూరు శాతం రాయితీపె కంది విత్తనాలు ఆ రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం క్రోసూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి. హనుమంతరావు, తహశీల్దార్ ఎన్.దుర్గేశ్వరరావు మాట్లా_డారు. రెవిన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామంలోని కౌలు రైతులందరికి పంట సాగుతారు హక్కు పత్రాలు ఇచ్చి పంట నమోదు నూరు శాతం జరిగేలాగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పండ్ల తోటలు,కూరగాయలు సాగుచేసే రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి సంబంధిత రాయితీలను సద్వినియోగపరచుకోవాల్సిందిగా ఉద్యాన సహాయకురాలు డి.రజిని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు అడపా వెంకటేశ్వర్ రెడ్డి, జల్దీ సాంబశివరావు, ఆసుల నాగేశ్వరరావు, కొడవటి రాంబాబు, వెంకట శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - దాచేపల్లి

అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిం చాలని మండల కన్వీనర్ కోట కృష్ణ అన్నారు. మండలం లోని పెద్దగార్లపాడు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వ హించారు. కృష్ణ మాట్లాడుతూ 'జగనన్న సురక్ష' కార్య క్రమాన్ని ప్రతి గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజులపాటు నిర్వహించేందుకు ఈ కార్యక్రమాన్ని అందు బాటులోకి తెచ్చామన్నారు. సర్పంచ్ వరలక్ష్మి, శివ,వెంకట కోటయ్య మండల మాజీ కన్వీనర్ షేక్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

రూపాయి ఖర్చు లేకుండా ధ్రువపత్రాలు

ప్రజాశక్తి-నాదెండ్ల

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సత్వరమే పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ తలచోటి రాణి అన్నారు శుక్రవారం మండలంలోని గురిజవోలు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం ద్వారా ఒక రూపాయి ఖర్చు లేకుండా 11 రకాల ధ్రువ పత్రాలను పొందవచ్చునని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఏవి రమణ ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ కాట్రగడ్డ మస్తాన్రావు సింగారెడ్డి కోటిరెడ్డి మంగు ఏడుకొండలు పాల్గొన్నారు.

కేసనపల్లిలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

టిడిపి ద్వారానే రాష్ట్రాభివృద్ధి, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ టిడిపి ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోను నరసరావుపేట మండలం కేసనపల్లి గ్రామ పరిధిలోని ఎస్.ఆర్.కే.టి కాలనీలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తేనే తమ భవిష్యత్తు బాగుపడు తుందని, మహిళా సాధికారత టిడిపి ద్వారానే సాధ్యమని డాక్టర్ చదలవాడ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా సంపాదించారని, సహజ వనరులను దోచుకుంటూ,ప్రభుత్వ ,దేవాదాయ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

పాపాయపాలెంలో ముగ్గురాయి క్వారీ మైనింగ్ కు అనుమతులు ఉన్నాయా?

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని పాపాయిపాలెం గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 387-7-1లో ముగ్గురాయి క్వారీ మైనింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్వారీకి అనుమతులు ఉన్నాయా లేవా అని గ్రామస్తులు చర్చించుకోవడం చర్చనీయాంశంగా మారింది. అటవీ ప్రాంతానికి సమీపంలో ఈ క్వారీ నిర్వ హిస్తుండటం, పెద్ద పెద్ద లారీల లోడుతో వాహనాలు ఫారెస్ట్





రహదారి గుండా వెళ్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రోజు బ్లాస్టింగ్ తో పెద్ద పెద్ద శబ్దాలతో ధ్వనులు వస్తున్నట్లు శబ్దాలు వచ్చినప్పుడు చుట్టుప్రక్కల ఉన్న ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నామని, ఈ క్వారీ నిర్వహణకు లైసెన్స్ ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. బ్లాస్టింగ్ జరిగే ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు లేవని, పశువుల కాపరులు ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవుతారోననే భయాందోళనలు వ్యక్తవు తున్నాయి.



భృగుబండ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులు

చురుగ్గా ఆర్‌యుబి నిర్మాణ పనులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైల్వే గేటు స్థానంలో అధికారులు అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల, భృగుబండ మార్గంలో ఉన్న రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు స్థానంలో ఆర్‌యుబి నిర్మాణం చేపడుతున్నారు. రైల్వే గేటు పడిన ప్రతిసారి రాకపోకలకు ఆటంకం ఏర్పడటంతో వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సత్తెనపల్లి నుండి భృగుబండ, కందులవారిపాలెం, గరిక పాడు, దొడ్లేరు వెళ్ళేందుకు తక్కువ దూరం కావడంతో ఎక్కువ మంది ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. రైల్వే గేటు ఉండటంతో వాహనదారులు ఇబ్బం దులు పడుతున్నారు. రైల్వే అధికారులు రెండు మార్గాలుగా బ్రిడ్జిని నిర్మించారు. ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు పోయేందుకు అనువుగా 20 అడుగుల ఎత్తులో ఒకటి, ఆటోలు, ట్రాక్టర్లు వెళ్ళే విధంగా 12 ఆడుగుల ఎత్తులో మరొకట ఏర్పాటు చేశారు. వర్షా కాలంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి లోకి వర్షపు నీరు ని ల్వ ఉండకుండా కాల్వను తవ్వి ఎదువాగులో కలిపారు. నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారుల వేతలు తీరనున్నాయి.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శనివారం 15 జూలై 2023

18న 'చలో గుంటూరు'కు తరలిరండి

ప్రజాశక్తి-తాడేపల్లి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్ల యూనియన్

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న చలో గుంటూరు కార్యక్రమానికి తరలి రావాలని ఆశ వర్కర్ల యూనియన్ తాడేపల్లి మండల గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆశాలతో సంబంధంలేని పనులు చేయించకూడదని డిమాండ్ చేశారు. గుంటూరు డిఎంఅండ హెచ్ఒ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు డాక్టర్ కెవి కిరణ్‌కుమార్, కృష్ణనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మానస మంజరి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కె.లక్ష్మి, సుగుణ, రేణుక, వరలక్ష్మి, కె.జ్యోతి, కుమారి పాల్గొన్నారు.



ఆశా వర్కర్లతో వెట్టిచాకిరి తగదు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిడమర్రు యూపీఎస్సీ వద్ద శుక్రవారం ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ ఆశా వర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందని, పనిచేయని స్మార్ట్ ఫోన్లు ఇచ్చి పని చేయమంటోందని విమర్శించారు. ఈ నెల 18వ తేదీన గుంటూరు డిఎం హెచ్ఒ ఆఫీస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో ఆశా కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కులమతాలకు అతీతంగా విద్యార్థులు ఎదగాలి

తాడికొండ మండలంలో పర్యటించిన క్రికెటర్ అంబటి రాయుడు

ప్రజాశక్తి - తాడికొండ

సమాజాన్ని పీడిస్తున్న కులమతాలకు అతీతంగా నేటి విద్యార్థులు ఎదగాలని క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. పర్యటనలో భాగంగా మండలంలోని కంతేరు, తాడికొండ, బడేపురం, గరికపాడు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ముందుగా కంతేరులో పర్యటించారు. అనంతరం తాడికొండలోని వెలంకి వెంకటప్పయ్య హైస్కూల్ లో విద్యార్థులతో మాట్లాడారు. హైస్కూల్ మైదానంలో విద్యా ర్థులతో కొంచెం సేపు క్రికెట్ ఆడారు. విద్యార్థులను ఉద్దేశించి రాయుడు మాట్లాడుతూ నేడు సమాజంలో కులమతాలు అనే రోగం ఎక్కువైందని, వీటికి ప్రభావితం కాకుడదని అన్నారు. తోటి వారికి సాయం చేయాలని, చదువుతో పాటు క్రీడల్లో కూడా ముందుండాలని అన్నారు. ధోని, విరాట్ లాగా ప్రతిరోజూ ముందడుగు వేస్తు విద్యార్థులు తమ జీవితంలో గొప్ప స్థాయికి వెళ్ళాలని సూచించారు. ప్రస్తుతం తన ప్రాంతానికి ప్రజలకు సేవలు చేయాలనే ఆలోచనతో ముందుకి సాగుతానని చెప్పారు. ప్రజలకు ఏవిధంగా సేవ చేయాలనే దానిపై ముందస్తు అవగాహన కోసమే ఈ పర్యటన అని అన్నారు.

కెఎల్ యు లో ఘనంగా సిఎస్ ఆర్ జయంతి.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

రంగస్థల, సినీ వినీలాకాశంలోనటుడిగా తెలుగువారి మనస్సులలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న చిలకలపూడి సీతారామాంజనేయులు (సిఎస్ఆర్) 116వ జయంతిని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో శుక్రవారం నిర్వహించారు. సిఎస్ ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) సహకారంతో తాము ఈ కార్యక్రమాన్ని తల పెట్టా మంటూ హాబీ క్లబ్ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.సుభాకర్ రాజు తెలిపారు.

టిడ్కో గృహాలు సమస్యల మయం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



నిడమర్రు పంచాయతి కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

నిడమర్రులో ప్రభుత్వం కట్టిన టిడ్కో గృహాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిడమర్రు పంచాయతి కార్యదర్శికి వినతిపత్రం ఇవ్వడం జరి గింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎం.భాగ్యరాజ్ మాట్లాడుతూ మంగళగిరి-నిడమర్రు ఆర్ అండ్ బి రోడ్డు నుండి వరకు రోడ్డు సరిగా లేదని, వర్షం పడితే నడవడానికి కూడా వీలు లేకుండా ఉందని ,రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు లేక కారు చీకట్లో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని, పనుల నిమిత్తం వెళ్లిన మహిళలు వాటిని ముగించుకుని తిరిగి ఇళ్లకు చేరాలంటే ఆర్ అండ్ బి రోడ్డు వద్ద భయంగా ఉంటోందని చెప్పారు. దీనికితోడు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఉండే మందుబాబులు మహిళలను అనుసరిస్తున్నారని అన్నారు. మొత్తం 540 ఇళ్లకు గాను సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడం వల్ల మురుగు పేరుకుపోతోందని, వర్షం పడితే కుంటల్లో నీళ్లు నిండుతున్నాయని, చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయని, వాటిలో పురుగుపుట్రా చేరుతోందని, ప్రహరీ గోడ లేకపోవడం వల్ల ఎవరు పడితే వారు ఇళ్లల్లోకి వస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయా సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ వినతిపత్రం అందించారు కార్యక్రమంలో లక్ష్మీ, చలపతిరావు, ముసలయ్య, పెద్ద తిరపతయ్య, ఎస్కే. నాగూర్ పాల్గొన్నారు.

హైకోర్టులో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - తుళ్లూరు



మాట్లాడుతున్న సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి భాగ్యరాజు

హైకోర్టులో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు డిమాండ్ చేశారు.శుక్రవారం జరిగిన కార్మికుల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ,హైకోర్టులో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెల నెలా జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని, కొత్తగా వచ్చిన ట్రిబుల్ ఎస్ కంపెనీ పది నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క నెల కూడా పిఎఫ్ కట్టలేదని,ఈఎస్ఐ కార్డులు మంజూరు చేయలేదని చెప్పారు.ప్రతి నెలా జీతంలో మాత్రం కోతలు విధిస్తున్నారని,ఇదంతా సాక్షాత్తు హైకోర్టు ఆవరణ జరుగుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఎవరైనా జీతాల గురించి, పీఎఫ్ ల గురించి మాట్లాడితే మిమ్మల్ని ఉద్యోగం నుండి తీసేస్తామని కంపెనీ ప్రతినిధులు బెదిరింపులకు పాల్పడుతున్నా రని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు సక్రమంగా జీతాలు, పిఎఫ్ ,ఈఎస్ఐ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిం దిగా విజ్ఞప్తి చేశారు.సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు



నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు భాను శ్రీ, భరణిని అభినందించిన ఉపాధ్యాయులు

రాజీవ్ గాంధీ టెక్నలాజికల్ యూనివర్సిటీ ట్రిపుల్ ఐటీ ప్రవేశాలలో నారాకోడూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. పొన్నూరు నియజకవర్గంలో ఎస్ఎస్‌సి పరీక్ష ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు దాసరి భాను శ్రీ 586 మార్కులు, దాసరి భరణి 584 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారన్నారు. భానుశ్రీ, భరణిలకు నూజివీడు ట్రిపుల్ ఐటీ లో మెరిట్ కోటాలో ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యా యులు తెలిపారు. నారాకోడూరు పాఠశాలల్లో రోజువారీ కూలీ చేసుకునే పేద తల్లిదండ్రుల పిల్లలు కష్టపడి చదివి ట్రిపుల్ ఐటీకి ఎంపికవడం చాలా సంతోషకరమన్నారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేసి వారి విజయానికి కృషి చేసిన ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల కమిటీ చైర్మెన్ డి అంకమ్మరావు, సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్



లక్ష్మీపతి, దివ్య సాయిశ్రీ

పట్టణ పరిధిలోని నేతాజీ నగర్ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ట్రిపుల్ ఐటీ లో సీట్లు సాధించారని ప్రధానోపాధ్యాయులు శుక్రవారం తెలిపారు, గూడూరు లక్ష్మీపతి 566 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించగా, దివ్య సాయి శ్రీ 560 మార్కులతో సెకండ్ ర్యాంక్ సాధించారని తెలిపారు. వీరిద్దరూ ట్రిపుల్ ఐటీ కి జోదోలు క్యాంపస్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

17 నుండి చైతన్య సదస్సులు

ప్రజాశక్తి-గుంటూరు



కారంచేడు, చుండూరు మృత వీరుల సంస్మరణ దినం సంద ర్భంగా జిల్లాలో అన్ని గ్రామాల్లో జులై 17 నుండి ఆగస్టు 6 వరకు దళిత బహుజన చైతన్య సద స్సులు నిర్వహిస్తున్నట్లు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ తెలిపారు.శుక్రవారం అరండల్ పేట లోని భీమ్ భారత్ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అత్యాచారాలకు అవ మానాలకు గురవుతున్న కులాలను ఏకం చేసేందుకు ఈ సమావేశాలు నిర్వమిస్తున్నామన్నారు. చివరిగా ఆగస్టు 6 గుంటూరు అంబేద్కర్ భవన్‌లో జిల్లా సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 17న కారంచేడు మత వీరుల సంస్కరణ సభ అరండల్ పేట భీమ్ భారత రాష్ట్ర కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు. కరపత్రం ఆవిష్కరించిన వారిలో భీమ్‌భారత్ రాష్ట్ర నాయకులు బి. వెలిసిన్ రాజ్, డి.రాజేంద్రప్రసాద్, జె. మోహన్, ఎన్. రత్నం, పి.శ్యాం పాల్గొన్నారు.

విద్యాసంస్థలను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి-తెనాలి



పట్టణంలో పాఠశాలలు కళాశాలలను మండల విద్యాధికారి 2 వి.జయంతి బాబు శుక్రవారం పరిశీలించారు. గంగానమ్మపేట ఎన్నారై పాఠశాల, ఎన్ఆర్ఐ కాలేజ్, శ్రీ నవోదయ స్కూల్, జేఎంజే కాలేజీ, ఎన్వీఆర్ మున్సిపల్ పాఠశాలలను పరిశీలించి యుడైస్ ప్లస్ ఆధారంగా డేటా వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల రోల్, లాంగ్ ఆబ్సెంటీస్, డ్రాప్‌ఔట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థుల ఖచ్చితమైన డేటాను సేకరించుటలో భాగంగా విద్యాశాఖ ఆదేశానుసారం ఆన్లైన్ ఎంట్రీ యు డైస్ ప్లస్ నూరు శాతం చేసింది లేనిది అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలన్నీ కూడా ఖచ్చితమైన సమయపాలన పాటించాలని, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం బోధన జరగాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా టాయిలెట్ నిర్వహణ ఉండాలన్నారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదులను పరిగణన లోకి తీసుకుని ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.జగనన్న గోరు ముద్ద మెనూ విద్యార్థుల హాజరు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కళాశాలల ప్రిన్సిపాల్ , క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఎ.దీపాంజలి ఉన్నారు.



నివాళులర్పిస్తున్న శ్రీనివాస్,రాజవర్ధన్

'శ్రీ చైతన్య' అధినేత బిఎస్ రావు మృతికి నివాళి

ప్రజాశక్తి - తుళ్లూరు

శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బొప్పన సత్యన్నారాయణ (బి ఎస్ రావు) మృతి పట్ల పలువురు నాయకులు నివాళులర్పించారు.శుక్రవారం విజయవాడలో బి ఎస్ రావు మతదేహాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, తాడికొండ నియోజక వర్గ టిడిపి నాయకులు డాక్టర్ తోకల రాజవర్ధన్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఎంతో క్రమశిక్షణ కలిగిన బి ఎస్ రావు విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యాభివృద్ధికి ఆయన కృషి చేశారని అన్నారు.

'అభివృద్ధి పేరుతో దోచుకుటున్నారు'

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రాష్ట్రంలో జగన్ సంక్షేమం పేరుతో దోచుకుంటుంటే, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అభివృద్ధి పేరుతో నియోజకవర్గంలో దోచుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. పొన్నూరు పట్టణ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ పేరుతో రైతులను మోసం చేసి భూములు దోచుకోవాలని చూస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు. తాము అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా 60 కోట్ల ఆస్తి ఎమ్మెల్యేకు దక్కకుండా పోతోందోనే ఉక్రోషంతో ఎమ్మెలేయ తమను తిడుతున్నారని అన్నారు. 2019లోనే ఆలయ భూములు స్వాహాకు కుట్రలు లేపారని, 19.99 ఎకరాల భూమిని 33 సంవత్సరాలు లీజు కోసం వాణిజ్య అవసరాల కోసం ప్రతిపాదిస్తే ఆలయ అనువంశిక ధర్మకర్త దానిని వ్యతిరేకిస్తే ఆ ప్రతిపాదన ఆగిపోయిన మాట వాస్తవం కాదా అని దుయ్యబట్టారు ఎమ్మెల్యే కు చిత్తశుద్ధి ఉంటే రోడ్డు విస్తరణ, ఆటోనగర్ నిర్మాణం, షాదీ ఖానా నిర్మాణం, చేబ్రోలు వంతెన నిర్మాణాలు ఆయన ఎమ్మెల్యే అయినప్పుడే ప్రారంభించి ఉంటే పూర్తయ్యేవని అన్నారు.

చంద్రయాన్-3 విజయవంతం కోరుతూ ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి

భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన రాకెట్ చంద్రయాన్ 3 విజయవంతం కావాలంటూ స్థానిక బోస్ రోడ్డు లోని నెహ్రూ నికేతన్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి పర్యవేక్షణలో నిర్వహించిన ర్యాలీలో చిన్నారులు జయహో ఇస్రో, మేరా ఇస్రో మహాన్ మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలు చేశారు.రాకెట్ బొమ్మలు, బెలూన్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

విజ్ఞాన్‌కు రూ.21 లక్షల సిఎస్ఐఆర్ ప్రాజెక్ట్

ప్రజాశక్తి-గుంటూరు :వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ దేవునూరి నాగరాజుకి న్యూఢిల్లీలో గల సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) నుంచి రూ.21 లక్షల విలువ గల ప్రాజెక్టు మంజూరైందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ' సిక్స్-ఫోల్డ్ ఎఫికసీ ఆఫ్ ప్రోలైన్ యాంకర్డ్ మెల్లిటిక్ యాసిడ్ ఆర్గనోక్యాటలిస్ట్స్: ఏ యూనిక్ అప్రోచ్ ఫర్ సస్టేనబుల్ అసిమెట్రిక్ క్యాటాలిసిస్ ' అనే అంశంపై పరిశోధనకు గాను రాబోయే 3 సంవత్సరాలకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందన్నారు. సీఎస్ఐఆర్ ప్రాజెక్ట్ గ్రాంట్ సాధించిన ప్రొఫెసర్ దేవునూరి నాగరాజును విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకష్ణదేవరాయలు, వీసీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు అభినందించారు.



నాగరాజును అభినందిస్తున్న విజ్ఞాన్స్ వైస్ చైర్మన్ కృష్ణదేవరాయలు

ఇంటర్నేషనల్ కంపెనీతో కిట్స్ ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో సిఎస్ఇ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సింగపూర్‌కు సంబంధించిన ఇంటర్నేషనల్ కంపెనీ అయిన ఆల్గోరాండ్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా దేశంలోనే ఐదవ అకాడమీ ఇన్‌స్టిట్యూట్‌గా ఒప్పందం చేసుకున్నట్లు కిట్స్ చైర్మన్ కోయి సుబ్బారావు తెలియజేశారు. ఈ ఒప్పందంలో భాగంగా కంపెనీవారు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ఇంటర్న్‌షిప్, హ్యాకథాన్స్ ఆర్గనైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా విద్యార్థులచే ఆల్గోర్యాండ్ బ్లాక్ చైన్ క్లబ్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ క్లబ్ ద్వారానే అన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ఇలాంటి ఇంటర్నేషనల్ ఒప్పందాల ద్వారా కళాశాల మరో మైలురాయి దాటిందని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ బి.భానుప్రకాష్ అధ్యాపక, సిబ్బంది పాల్గొన్నారు.





ఐపిఎ శాఖ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఐపిఎ అధ్యక్షులు, తదితరులు

హిందూ ఫార్మసీలో ఐపిఎ శాఖ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు ఇండియన్ ఫార్మసుటికల్ అసోసియేషన్, అమరావతి శాఖ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇండియన్ ఫార్మాసుటికల్ అసోసియేషన్ అధ్యక్షులు, రాజమండ్రిలోని వికాస్ ఫార్మసీ కళాశాల చైర్మన్ డాక్టర్ టి.వి.నారాయణ, ఐపిఎ ఎడ్యుకేషన్ డివిజన్ చైర్మన్, చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర హాజరయ్యారు. టి.వి.నారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో సుమారు 60 ఐపిఎ శాఖలు ఉన్నాయని చెబుతూ ఈ సంస్థ ద్వారా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తాము ప్రవేశ పెట్టిన అవార్డులు, రివార్డుల గురించి తెలియజేశారు. ఫార్మసీ విద్యార్థులకు వాక్సినేషన్ ట్రైనింగ్ ఫైజర్ సంస్థలో ఇంటర్న్షిప్ అవకాశాల గురించి వివరించారు. డాక్టర్ ఎస్. విద్యాధర మాట్లాడుతూ ఎడ్యుకేషన్ డివిజన్‌లో తాము చేపట్టిన కార్యక్రమాలను గురించి వివరించారు. హానరరి చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకష్ణ మూర్తి మాట్లాడుతూ ఐపిఎ శాఖలు మన ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో హిందూ డిగ్రీ కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్‌పోస్ట్ ద్వారా ఓటరు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని ఏడు అసెంబ్లీలో నియోజక వర్గాలకు సంబంధించి మొదటి విడత 2021 జనవరి 16 నుండి 2022 అక్టోబర్ 15వ తేదీ వరకూ కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారు, చిరునామాలు మార్పు చేసుకున్న వారికి సంబంధించిన 36,990 మంది ఎలక్షన్ ఫోటో గుర్తింపు కార్డులను సంబంధిత కార్డుదారులకు స్పీడ్ పోస్ట్ ద్వారా వారి చిరునామాకు అందజేసినట్లు జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోస్టల్ సూపరింటెండెంట్‌కు కలెక్టర్ ఆయా గుర్తింపు కార్డులను అందజేశారు. అలాగే రెండో విడతలో 2022 అక్టోబర్ 16 నుండి 2022 డిసెంబర్ 26 వరకూ కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారు, చిరునామా మార్పు చేసుకున్న వారికి సంబంధించిన 32,301 ఎలక్షన్ ఫోటో గుర్తింపు కార్డులను కూడా సూపరింటెండెంట్‌కు అందచేశారు.



పోస్టల్ సూపరింటెండెంట్‌కు గుర్తింపు కార్డులు అందజేస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి

నియోజక వర్గం	మొదటి విడత	రెండో విడత
తాడికొండ	3399	3242
మంగళగిరి	8545	4297
పొన్నూరు	4590	4036
తెనాలి	6165	3481
ప్రత్తిపాడు	6962	3680
గుంటూరు వెస్ట్	3270	6313
గుంటూరు ఈస్ట్	4059	7252
మొత్తం	36990	32301

ఒకేరోజు 11 ప్లాస్టిక్ సర్జరీలు

వైద్యులను అభినందించిన డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి లో శుక్రవారం ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ విభాగం నేతత్వం లో ఒకే ఆపరేషన్ దియేటర్ లో ఏకంగా 11 శస్త్ర చికిత్స లు చేసి రికార్డు సష్టించారు. పుట్టుక తో చెవి కోల్పోవడం, మొర్రి గ్రహణం, అతుక్కుపోయిన వేళ్ళను సరి చేయడం వంటి ఆపరేషన్ లు చేయడం నిజంగా గర్వ కారణమని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ విభాగం బందాన్ని ఆయన అభినందించారు. ఈ శస్త్ర చికిత్స లో ప్రొఫెసర్ డాక్టర్ సుమిత శంకర్, డాక్టర్ గంగా భవాని, డాక్టర్ నజ్మా, డాక్టర్ చంద్ర లేఖ, డాక్టర్ నిషాంత్, కతి, పీజీ లు డాక్టర్ నిఖిల, నవ్య, విజయ, అనాస్థిషియా వైద్యులు నాగభూషణం, ఆనంద్ పాల్గొన్నారు.

క్యాజువాల్టీలో వైద్యులకు కనీస సదుపాయులు

స్టెప్ డౌన్ ఐసియు ను వెంటిలేటర్ ఐసియు గా మార్పు

కార్పొరేట్ స్థాయి లో న్యూరాలజీ వార్డు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి అత్యవసర విభాగం వైద్యులకు, వైద్య సిబ్బందికి కనీస సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయల సంస్థ అధికారులతో క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలన చేశారు. 24 గంటల లేబరేటరీను సందర్శించారు. ఆ గదిలో రెండు పడకలు ఉండటాన్ని గమనించి అక్కడ నుంచి ఒకటి తొలగించారు. దాంతో ఆ గది పూర్తిగా విశాలంగా మారింది. మైనర్ ఓటిలో ఉపయోగం లేని బల్లలను కూడా వర్క్ షాపు తరలించారు. ఆపరేషన్ దియేటర్‌ను ప్రశాంతంగా ఉండే విధంగా తీర్చి దిద్దితే చికిత్సలు చేసేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు. క్యాజువాల్టీలో రెండు మృత దేహాలు గంటల తరబడి ఉండటాన్ని ఆయన సిబ్బంది పై తీవ్రంగా మండిపడ్డారు. క్యాజువాల్టిని మార్చురిగా చేస్తున్నారని వెంటనే వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాజువాల్టి లో వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి సరైన సౌకర్యాలు లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. క్యాజువాల్టి పరిసర ప్రాంతాలలోని వివిధ గదుల్లో పదికి పైగా టాయిలెట్స్ సౌకర్యలను కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ట్రేయజ్‌లో మెడికల్, సర్జికల్ విభాగాల్లో మరమ్మతులు చేయాలని, రంగులు వేయాలని చెప్పారు. ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద ఆరోగ్య శ్రీ కౌంటర్, రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద పరిశుభ్రం ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పుడున్న ఈసిజి గదిని మూడు భాగాలుగా చేయాలన్నారు. ఆ గదులలో ఇంజక్షన్, ఈ సి జి కోసం వచ్చే మహిళలకు, పురుషులకు వేరేవేరుగా చేయాలనీ ఆయన అధికారులకు ఆదేశించారు. స్టెప్ డౌన్ ఐ సి యు ను వెంటిలేటర్ ఐ సి యుగా మార్చాలని అందుకు అవసరమైన బడ్జెట్ కేటాయించమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆయన ఆదేశించారు. ఎమర్జెన్సి ఆపరేషన్ ధియేటర్‌లో మూడు ఆపరేషన్ గదులుగా మార్చాలని, ఒకటి సర్జికల్ సూపర్ స్పెషలిటీ, జనరల్ సర్జరీ, ఎముకలు, కీళ్ళు విభాగానికి కేటాయించి వసతులు అందించాలన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ గదిని ఎండో స్కోపి గది గా మార్చాలన్నారు. అత్యవసర విభాగం సమీపంలో ని కారిడర్ వద్ద స్టోర్ రూమ్‌ను ఏర్పాటు చేసి అందులో మందులు, ఇతర సామాగ్రి నిల్వ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని అయన ఆదేశించారు.



అత్యవసర విభాగంలో సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

కార్పొరేట్ స్థాయిలో న్యూరాలజీ వార్డు...

ఆసుపత్రిలోని న్యూరాలజీ వార్డు కార్పొరేట్ స్థాయికి తీసుకుని వెళ్ళారని డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఆయన ఆ విభాగాన్ని సందర్శించి అక్కడ ఉన్న పరిశుభ్రత, వైద్యులు అందుబాటులో ఉండటం పై డాక్టర్ సుందర చారి ని అయన అభినందించారు. వార్డును అద్భుతం గా ఆవిష్కరించారని ఆయన కితాబు ఇచ్చారు. ఈ విభాగం లో అయిదారు సంవత్సరాల నుంచి పని చేస్తున్న నలుగురు సిబ్బందికి సానిటేషన్ వర్కర్లుగా తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా న్యూరో సర్జరీ లో మానిటర్‌లకు, ఈసిజి కేబుల్ లేకపోవడం ఇబ్బందులుగా ఉందని చెప్పడంతో వెంటనే ఆ విభాగానికి వాటిని అందించారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ యం ఓ డాక్టర్ సతీష్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి ఎస్ ఎస్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సువరింటెండెంట్ ఆశ సజని, శామీనా బేగం పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై మలినేనిలో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

మలినేని ఇంజినీరింగ్ కాలేజి, ఎంబిఎ డిపార్ట్మెంట్‌లో 'బహుళజాతి సంస్థల్లో శాప్‌పై ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై ఎంబిఎ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ ప్రపంచంలో నైపుణ్యం ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. బెంగుళూరు, క్యాప్‌జెమినీ సీనియర్ అసోసియేట్ పి.వి.సురేష్ ఉద్యోగావకాశాల గురించి వివరించారు. అలాగే అవకాశాలను ఎలా తెలుసుకోవాలి, రెస్యూమ్‌లు ఎలా తయారు చేసుకోవాలి, కంపెనీలను ఎలా సంప్రదించాలి మొదలైన అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ పి.రమేష్‌బాబు, సిఎఒ డాక్టర్ పూర్ణచంద్రరావు, ఎంబిఎ విభాగాధిపతి పి.కళ్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సురేష్‌కు జ్ఞాపిక అందచేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల దరఖాస్తుకు నేడే ఆఖరు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2023కు దరఖాస్తు చేసుకోవటానికి నేడే ఆఖరి రోజు.కావున అర్హులైన ఉపాధ్యాయులు జిల్లాలోని ఎంఇఒలు/ ఉప విద్యాశాఖ అధికారి ద్వారా తమ ప్రతిపాదనలను 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా http//nationalawardstoteachereducation. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ పి.శైలజ ఒక ప్రకటనలో కోరారు.